మంగళ వారం
14-11-2023
సంపుటి - 08,
సంచిక - 387
పేజీలు - 4
వెల రూ. 5/-
Telangana
Andhra Pradesh

CEO & Editor : G. PRUDHVIRAJ

RNI NO: TELTEL/2016/73311

www.samasamajam.in

# సమ సమాజం

SAMA SAMAJAM TELUGU DAILY

తెలుగు వార్త పత్రిక

Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Warangal, Medak, Karimnagar, Kammam, Vishakapatnam, Vijayawada, Ongole

# నాంపల్లి బజార్ ఘాట్‌లో అగ్నిప్రమాదం

## మంటల్లో చిక్కుకుని 9 మంది కార్మికులు మృతి





- అగ్నిప్రమాదంపై దర్యాప్తు వేగవంతం
- ఘటనపై సీఎం కేసీఆర్ దిగ్భ్రాంతి
- ఘటనపై విచారణ జరిపిస్తాం
- బాధిత కుటుంబాలను పరామర్శించిన కేటీఆర్
- మృతుల కుటుంబాలకు రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటన

**హైదరాబాద్, నవంబర్ 13 (సమ సమాజం):** చికటిని పారదోలుతూ వెలుగులు తెచ్చే దీపావళి.. వారి కుటుంబాల్లో కారు చీకట్లు నింపింది. దివ్వెల వెలుతురు, టపాసుల మోతతో సందడి నెలకొనే వేళ.. ఆ ప్రాంతం ఆర్తనాదాలతో మార్మోగింది. ఎక్కడ చిచ్చు రేగిందో తెలియలేదు.. ఎలా అంటుకుందో అంతుపట్టలేదు. కళ్లుమూసి తెరిచేలోగా.. కారుచీకటి అలుముకుంది. సాయం కోసం పిలిచేలోగా.. ఊపిరే ఆగిపోయింది. పై అంతస్తు నుంచి బయటికి రాలేక కొందరు.. ప్రాణాలు దక్కించుకునేందుకు పరుగులు తీస్తూ మరికొందరు.. అత్యంత దయనీయస్థితిలో సజీవ దహనమయ్యారు. హైదరాబాద్ నాంపల్లిలో జరిగిన ఘోర అగ్నిప్రమాదం.. 9మందిని బలితీసుకుంది. గాయపడిన మరో 20 మంది ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. నిమిషాల్లోనే అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని.. మంటలు అదుపులోకి తీసుకొచ్చారు. కానీ, అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. ప్రమాదం నుంచి తప్పించుకునేందుకు అపార్ట్‌మెంట్‌లో ఉన్న ముగ్గురు మెట్ల ద్వారా కిందికి వస్తూ.. మంటల ధాటికి సజీవదహనమయ్యారు. మరో కుటుంబానికి చెందిన ఆరుగురు ఇంట్లోనే ఉండిపోయి.. పొగ కమ్మేసి, ఊపిరాడక చనిపోయారు. పెద్దఎత్తున ఘటనాస్థలికి చేరుకున్న అగ్నిమాపక, జీహెచ్‌ఎంసీ, ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది మంటలను అదుపుచేసి అపార్ట్‌మెంట్లోకి ప్రవేశించారు. అప్పటికే ప్రాణాలు కోల్పోయిన 9 మంది మృతదేహాలను బయటికి తీసుకువచ్చారు. అపస్మారక స్థితిలోకి వెళ్లిన మరో 2 ఇళ్లకు చెందిన 8 మందిని కిందికి తీసుకువచ్చారు. చనిపోయిన వారిలో మహ్మద్ ఆజాం, ఆయన భార్య రెహానా సుల్తానా, కుమార్తెలు ఫైజా సమీన్, బీడీఎస్ డాక్టర్ తహూరా ఫర్హీన్, ఆమె పిల్లలు తూభ, తరూబా ఉన్నారు. అలాగే మరో కుటుంబానికి చెందిన జాకీర్ హుస్సేన్, ఆయన భార్య నికత్ సుల్తానా, వారి కుమారుడు హసీబ్ -ఉర్ - రెహమాన్ ఉన్నారు. మృతదేహాలను పోస్టుమార్టం కోసం ఉస్మానియా మార్చురీకి తరలించిన పోలీసులు.. గాయపడిన వారికి అదే ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. రమేశ్ జైస్వాల్ అనే భవన యజమాని కొన్నేళ్లుగా తన ఇంట్లో రసాయనాల గోదాము నిర్వహిస్తున్నాడు. కూలర్ల డబ్బాలతో పాటు.. గేట్లకు బిగించే షీట్లను తయారు చేసేందుకు ఈ రసాయనాలను ఉపయోగిస్తారు. కెమికల్స్‌తో పాటు ఇతర ముడిసరుకులను గ్రౌండ్‌ఫ్లోర్‌లో ఉన్న గోదాములో ఉంచాడు. పైనున్న 4 అంతస్తులను అద్దెకు ఇచ్చి.. ఇంటికి సమీపంలోనే శ్రీబాలాజీ ఎంటర్‌ప్రైజెస్ పేరుతో దుకాణం నిర్వహిస్తున్నారు. రసాయనాలు కావాల్సిన వాళ్లు ఎవరైనా దుకాణానికి వస్తే.. గోదాములో ఉన్న డ్రమ్ముల్లోంచి డబ్బాలు నింపి, దుకాణం వద్దకు తీసుకొచ్చి విక్రయిస్తుంటారు. ఈ క్రమంలోనే గతేడాది ఇదే ఇంట్లో రసాయనాలు పడి వాచ్‌మెన్ కుమార్తెకు తీవ్ర గాయాలైనట్లు స్థానికులు చెబుతున్నారు. తాజాగా జరిగిన అగ్నిప్రమాదం తీవ్రత పెరిగి.. 9 మంది చనిపోవడానికి ఈ రసాయనాలే కారణమని తేలింది. మంటలను అదుపులోకి తెచ్చేందుకు అగ్నిమాపక సిబ్బంది నీళ్లు చల్లితే.. రసాయనాల్లో కలిసి రహదారి మొత్తం జిడ్డు జిడ్డుగా మారింది. సహాయక చర్యలు చేపట్టే జీహెచ్‌ఎంసీ సిబ్బందితో పాటు.. పలువురు మీడియా ప్రతినిధులు జారి కిందపడిపోయారు. రహదారి మొత్తం రసాయనాలతోనే నిండిపోయింది. దాదాపు 50 డ్రమ్ములకు పైగా రసాయనాల డ్రమ్ములను గోదాములో నుంచి బయట పడేశారు. ఆ డ్రమ్ములకు మంటలు వ్యాపించి ఉంటే ప్రమాద తీవ్రత మరింత పెరిగి చుట్టుపక్కల ఉన్న ఇళ్లకు మంటలు వ్యాపించే ప్రమాదముండేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. భవనం కింద రసాయన గోదాము నిర్వహిస్తూ పైన అద్దెకిచ్చినట్టు పలుమార్లు ఫిర్యాదుచేసినా.. అధికారులెవరూ పట్టించుకోలేదని కాలనీవాసులు వాపోతున్నారు. సికింద్రాబాద్ లో గత ఏడాది సెప్టెంబర్‌లో రూబీ హోటల్ ఘటన, ఈ ఏడాది జనవరిలో దక్కన్ మాల్ , మార్చిలో స్వప్నలోక్ అగ్నిప్రమాదాలు తీవ్రవిషాదాలను మిగిల్చాయి. ఈ 3 ఘటనల్లో 29 మంది దుర్మరణం చెందగా.. తాజాగా అదే తరహాలో నాంపల్లిలో చోటుచేసుకున్న అగ్ని ప్రమాదంలో.. 9 మంది ప్రాణాలు కోల్పోవటం నగరవాసులను ఆందోళనకు గురిచేస్తోంది. నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న వ్యవహారాలపై జీహెచ్‌ఎంసీ

4వ పేజీలో...

# ఢిల్లీలో మళ్లీ పెరిగిన వాయు కాలుష్యం



**న్యూఢిల్లీ, నవంబర్ 13 (సమ సమాజం):** ఉక్కిరిబిక్కిరి చేస్తున్న వాయుకాలుష్యం నుంచి వర్షం ఉపశమనం కలిగించిందని సంతోషపడేలోపే మళ్లీ కాలుష్యం స్థాయిలు పెరిగాయి. వాయు కాలుష్యాన్ని మరింత పెంచే ప్రమాదకర రసాయనాలతో కూడిన బాణాసంచాపై సర్వోన్నత న్యాయస్థానం నిషేధం విధించినా సరే.. నగరంలో ఎక్కడికక్కడ టపాసుల విక్రయాలు, కొనుగోళ్లు, వినియోగం యదేచ్ఛగా సాగాయి. ఫలితంగా వాయుకాలుష్యం మళ్లీ పెరిగి ప్రమాదకర స్థాయికి చేరుకుంది. దీంతో క్లౌడ్ సీడింగ్ ద్వారా కృత్రిమ వర్షం కురిపించే యత్నాలను ఢిల్లీ ప్రభుత్వం

4వ పేజీలో...

# 17న తెలంగాణలో అమిత్ షా పర్యటన

- 25, 26, 27తేదీలలో మోడీ పర్యటన
- పూర్తిస్థాయిలో ప్రచారంపై దృష్టి పెట్టిన బీజేపీ
- 17న మేనిఫెస్టో విడుదలచేసే అవకాశం



**హైదరాబాద్, నవంబర్ 13 (సమ సమాజం):** తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు సమయం దగ్గరపడుతుండటంతో భారతీయ జనతా పార్టీ స్పీడు పెంచింది. పక్కా వ్యూహాలతో బీజేపీ పూర్తిస్థాయిలో ప్రచారంపై దృష్టి పెట్టింది. ఇక నుంచి ముఖ్య నాయకులను రంగంలోకి దించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తుంది. ఎన్నికల షెడ్యూల్ విడుదల నాటి నుంచి ప్రధాని మోడీ సహా.. అమత్ షా, పలువురు కీలక

4వ పేజీలో...

# కరెంట్, రైతుబంధుపై కేసీఆర్ మతిలేని మాటలు

- కొడంగల్‌లో జరిగిన అభివృద్ధి అంతా కాంగ్రెస్‌దే
- మాయ మాటలతో బీఆర్ఎస్ నాయకులు కాలం వెళ్లదీశారు
- కేసీఆర్ పాలనలో కృష్ణా జలాలు, రైల్వే లైన్ వచ్చాయా
- కొడంగల్ నియోజకవర్గం రోడ్‌షో నిర్వహించిన రేవంత్‌రెడ్డి



**హైదరాబాద్, నవంబర్ 13 (సమ సమాజం):** కొడంగల్‌లో జరిగిన అభివృద్ధి అంతా కాంగ్రెస్‌దేనని.. బీఆర్ఎస్ చేసింది శూన్యమని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. మాయ మాటలతో బీఆర్ఎస్ నాయకులు కాలం వెళ్లదీశారని మండిపడ్డారు. కొడంగల్ నియోజకవర్గం దౌల్తాబాద్,

4వ పేజీలో...

# రేవంత్‌రెడ్డి ప్రజలను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నారు

## సీఈఓ వికాస్‌రాజ్‌కు బీఆర్ఎస్ లీగల్ టీం ఫిర్యాదు



**హైదరాబాద్, నవంబర్ 13 (సమ సమాజం):**తెలంగాణ ఎన్నికల అధికారి వికాస్ రాజ్ ను బీఆర్ఎస్ లీగల్ టీమ్ కలిసింది. రేవంత్ రెడ్డి ప్రజలను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. బీఆర్ఎస్ పార్టీని కించపరిచే విధంగా కాంగ్రెస్ యాడ్స్ ను ఆపాలని సీఈవోకు కంప్లైంట్ చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ లీగల్ టీం సభ్యులు సోమా భరత్ మాట్లాడుతూ.. పచ్చగా ఉన్న తెలంగాణను హింసాత్మకంగా చేసేందుకు ఎన్నికలకు ముందే కాంగ్రెస్ పార్టీ కుట్రలు చేస్తోంది అని ఆరోపించారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి హింసను ప్రేరేపించే విధంగా వ్యాఖ్యలు చేస్తున్నారు.. క్యాడర్ ను రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేస్తున్నారు రేవంత్ రెడ్డి అని సోమా భరత్ అన్నారు. వారం రోజుల్లో దుబ్బాక, అచ్చంపేట ఘటనలు జరిగాయని బీఆర్ఎస్

4వ పేజీలో...

# ఎస్సీ వర్గీకరణ ఆలస్యంలో మొదటి ముద్దాయి కాంగ్రెస్

- వర్గీకరణపై సరిగ్గా పట్టించుకోని గత ప్రభుత్వాలు
- ఎన్నో కమిటీలు వేసి చేతులు దులుపుకున్నాయి
- బీజేపీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ఆరోపణ



**హైదరాబాద్, నవంబర్ 13 (సమ సమాజం):** ఎస్సీ వర్గీకరణపై గత ప్రభుత్వాలు ఎన్నో కమిటీలు వేసి.. సరిగ్గా పట్టించుకోలేదని బీజేపీ అధ్యక్షుడు కిషన్?రెడ్డి ఆరోపించారు. ముఖ్యంగా ఎస్సీ వర్గీకరణపై ఆలస్యం చేసింది కాంగ్రెస్? ప్రభుత్వమని దుయ్యబట్టారు. ఈ విషయంలో మొదటి ముద్దాయి కాంగ్రెస్ పార్టీ అని వ్యాఖ్యానించారు. దేశంలో ఎస్సీల వర్గీకరణ గురించి 30 సంవత్సరాలుగా పోరాటం జరుగుతోందని కిషన్?రెడ్డి పేర్కొన్నారు. దీనిపై అన్ని పార్టీలు కంటితుడుపు చర్యగా ప్రవర్తించాయని ఆరోపించారు. యూపీఏ ప్రభుత్వం కూడా తుషార్? మెహతా కమిటీ వేసి వదిలేసిందని తెలిపారు. ఆనాటి ప్రధాని మన్మోహన్? సింగ్ కమిటీ నివేదికను కూడా చదవలేదని ఆరోపించారు. మందకృష్ణ మాదిగ జులైలో ప్రధాని మోదీని కలిసి ఈ విషయం విన్నవించారని తెలిపారు. ఆగస్టులో ఎమ్మార్పీయస్ నాయకులను అమిత్? షా దిల్లీకి పిలిపించుకుని మాట్లాడారని చెప్పారు. ఎస్సీ వర్గీకరణపై గతంలో సుప్రీంకోర్టులో రెండు ధర్మాసనాలు పరస్పర విరుద్ధ తీర్పులు ఇచ్చాయని

4వ పేజీలో...

# 17న తెలంగాణకు రాహుల్ గాంధీ

- పాలకుర్తి, వరంగల్, భువనగిరిలో రాహుల్ సభలు
- ఆరు రోజుల పాటు ప్రచారంలో పాల్గొనున్న పలువురు నేతలు
- ప్రియాంక గాంధీ, మల్లికార్జున ఖర్గే కూడా పర్యటించే అవకాశం



**హైదరాబాద్,నవంబర్ 13 (సమ సమాజం):** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ.. ఈ నెల 17వ తేదీన రాష్ట్రానికి రానున్నారు. ఇదే రోజున పాలకుర్తి, వరంగల్, భువనగిరిలో రాహుల్ సభలు ఉండనున్నాయి. నేడోరేపో లోగా ప్రియాంక గాంధీ, మల్లికార్జున ఖర్గే పర్యటనలు ఖరారు అయ్యే అవకాశం ఉంది. రాష్ట్రంలో వివిధ తేదీల్లో ఆరు రోజుల పాటు ఎన్నికల ప్రచారంలో పాల్గొనున్నారు. . ఐదు రాష్ట్రాల్లో ఎన్నికలు జరుగుతున్నందున ఆయా రాష్ట్రాల్లో.. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ లతో పాటు జాతీయ స్థాయినేతలు ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. తెలంగాణ

3వ పేజీలో...

# మీరు వేలం పాటకు సిద్ధంగా ఉండండి

## కాంగ్రెస్ నేతలకు అక్బరుద్దీన్ హెచ్చరిక



హైదరాబాద్,నవంబర్13 **(సమ సమాజం):** తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో నేతల మధ్య మాటల పటాకులు పేలుతున్నాయి. ఈ క్రమంలో వేలం పాటకు సిద్ధంగా ఉండాలని కాంగ్రెస్ నేతలకు ఎంఐఎం పార్టీ ఎమ్మెల్యే అక్బరుద్దీన్ హెచ్చరించారు. ఇక నుంచి పరిణామాలు తీవ్రంగా ఉంటాయన్నారు. నేను ప్రసంగిస్తే దేశమంతా వణికిపోయిందని అన్నారు. సాయంత్రం నుంచి మిమ్మల్ని వేలం పాడుతా అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇక మీరు వేలం పాటకు సిద్ధంగా ఉండండాలని కీలక వ్యాఖ్యలు చేశారు. మరోవైపు ఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ ఓవైసీ పై టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. రేవంత్ మాట్లాడుతూ.. అసదుద్దీన్ ఓవైసీ తన షేర్వానీ లోపల పైజామా ఉందనుకున్నానని కానీ.. లోపల ఖాకీ నిక్కర్ ఉందని అర్థమైంది అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. అంతేకాకుండా.. ముస్లిం హక్కుల కోసం కొట్లాడాలని అసదుద్దీన్ తండ్రి ఆయన్ని బారిష్టర్ చదివించారు. కానీ.. అసదుద్దీన్ ముస్లింలను ఇబ్బంది పెడుతున్న బీజేపీకి మద్దతుగా ఉంటున్నారన్నారని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇక రాజాసింగ్‌పై మజ్లిస్ పార్టీ ఎందుకు పోటీ చేయడం లేదు? అంటూ రేవంత్ ప్రశ్నించారు. కాగా.. కేసీఆర్, మోడీ లాంటి దొంగలను కాపాడడానికి ఓవైసీ అబద్ధాలు చెప్తున్నారని రేవంత్ ఆరోపించారు. కాగా.. ఈ క్రమంలోనే.. అసదుద్దీన్‌కు రేవంత్ సవాల్ విసిరారు.. కర్ణాటక ఎన్నికల సమయంలో మోడీ, అమిత్ షాకు సన్నిహితుడైన ఓ కీలక వ్యక్తికి తన ఇంట్లో ఓవైసీ పార్టీ ఇచ్చారని సంచలన ఆరోపించారు. ఆ కీలక వ్యక్తికి పార్టీ ఇవ్వలేదని ప్రమాణం చేయడానికి ఓవైసీ సిద్ధమా? అని రేవంత్ ఛాలెంజ్ చేశారు. అంతేకాకుండా.. తాను హిందువునని భాగ్యలక్ష్మి గుడికి వెళ్తా.. దర్గాకి రమ్మన్నా వస్తానంటూ చెప్పుకొచ్చారు. అంతేకాదు.. మక్కా మసీదులో ప్రమాణం చేయడానికి ఓవైసీ సిద్ధమా? అంటూ సవాల్ విసిరారు. నేను శుక్రవారం రోజు మక్కా మసీదుకు వస్తానని.. ఖురాన్ పట్టుకొని ప్రమాణం చేయడానికి ఓవైసీ సిద్ధమా అంటూ రేవంత్ ఛాలెంజ్ విసిరారు.

# హైదరాబాద్‌లో మరోసారి ఐటీ దాడుల కలకలం

**పలు ఫార్మా కంపెనీ డైరెక్టర్ల ఇళ్లల్లో సోదాలు!**

**నగరవ్యాప్తంగా 10బృందాలుగా విడిపోయి సోదాలు**




హైదరాబాద్,నవంబర్13**(సమ సమాజం):** హైదరాబాద్?లో కొన్ని రోజులుగా ఐటీ సోదాలు కొనసాగుతూనే ఉన్నాయి. ఇటీవలే కాంగ్రెస్ నాయకుల ఇళ్లల్లో ఐటీ సోదాలు జరిగిన విషయం తెలిసిందే. తాజాగా నగరంలోని పలుచోట్ల మరోసారి ఐటీ దాడుల కలకలం రేగింది. 10 బృందాలుగా విడిపోయిన ఐటీ అధికారులు ఓ ప్రముఖ ఫార్మా కంపెనీ డైరెక్టర్ల ఇళ్లు, కార్యాలయాలు, సిబ్బంది నివాసాల్లో తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఆర్?సీపురంలోని నాగులపల్లి, అమీన్?పూర్?లోని పటేల్?గూడలో అధికారులు సోదాలు చేస్తున్నారు. గచ్చిబౌలిలోని మైహోమ్? భుజాలో కూడా తనిఖీలు చేస్తున్నారు. ఫార్మా కంపెనీ డైరెక్టర్లు బ్యాంకు వివరాలు, ఆర్థిక లావాదేవీలపై ఆరా తీస్తున్నారు.

# 17న తెలంగాణకు రాహుల్ గాంధీ

(మొదటి పేజీ తరువాయి) మినహా మిగిలిన 4 రాష్ట్రాల్లో ప్రచారం.. తుది దశకు చేరుకోనుంది. క తెలంగాణలోనూ ప్రచారం చేయడానికి.. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఈ నెల 17వ తేదీన రాష్ట్రానికి రానున్నారు. ఇదే రోజున పాలకుర్తి, వరంగల్, భువనగిరిలో రాహుల్ సభలు ఉండనున్నాయి. రాష్ట్రంలో వివిధ తేదీల్లో ఆరు రోజుల పాటు ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారు. ఎన్నికల ప్రచారం కోసం కాంగ్రెస్ పార్టీ రెండు హెలీకాప్టర్‌లను సిద్ధం చేసుకుంది. ఒకే రోజు రాష్ట్రంలో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, మల్లికార్జున ఖర్గే సమావేశాలు ఉండే అవకాశాలున్నాయి. ఇవాళ రేపట్లో ప్రియాంక గాంధీ, మల్లికార్జున ఖర్గే పర్యటనలు ఖరారు అయ్యే అవకాశం ఉంది. ప్రతి నియోజకవర్గంలో వీఐపీ పర్యటనలు ఉండేలా కాంగ్రెస్ కసరత్తు చేస్తుంది. ఈ నెల 17వ తేదీ తర్వాత కాంగ్రెస్ ముఖ్యమంత్రులు పర్యటనలు ఉండే అవకాశాలున్నాయి. తెలంగాణపై ఏఐసీసీ పూర్తిస్థాయిలో దృష్టి సారించింది. ఇప్పటికే హైదరాబాద్ వచ్చిన ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసి వేణుగోపాల్.. రాష్ట్ర రాజకీయాలు, పార్టీ పరిస్థితి, రాష్ట్రంలో జరుగుతున్న ప్రచారం.. నేతల మధ్య అంతరాలు వంటి అంశాలపై ఏఐసీసీ ప్రత్యేక పరిశీలకులతో సమీక్షించారు.రాష్ట్రంలో కేసీఆర్? పాలనపై ప్రజలు విసిగిపోయారని.. కాంగ్రెస్‌కు అనుకూలంగా ఉన్నారని.. నేతలంతా ఐక్యంగా పనిచేస్తే అధికారంలోకి వచ్చే అవకాశం



ఉందని స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. ఇప్పటివరకు జరిగిన ప్రచారం ఒక ఎత్తైతే.. ఇకపై జరిగేది అత్యంత కీలకమని పేర్కొన్నారు. ప్రచారాన్ని మరింత సమర్థంగా నిర్వహించేలా ముందుకెళ్లాలని సూచించారు. ఈ నెల 7 నుంచి పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా సుడిగాలి పర్యటన చేస్తున్నారు. ప్రత్యేక హెలికాప్టర్‌లో రోజుకు మూడు నియోజకవర్గాల్లో ప్రచారం చేస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యేలపై విమర్శనాస్త్రాలు సంధిస్తూనే బీఆర్?ఎస్? వైఖరిని ఎండగడుతున్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులను లక్ష్యంగా.. రేవంత్?రెడ్డి విమర్శలు గుప్పిస్తున్నారు. బీజేపీ తీరుపైన రేవంత్‌రెడ్డి విమర్శనాస్త్రాలు సంధిస్తున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఏం చేస్తారో వివరిస్తున్నారు. ప్రధానంగా ఆరు గ్యారెంటీలు, డిక్లరేషన్లు వంటి అంశాలను విస్తృతంగా జనంలోకి తీసుకెళ్తున్నారు.

# పలువురు పోలీసు అధికారుల బదిలీ




**హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో సీఈసీ చర్యలు**

**పోలీసు అధికారుల బదిలీకి ఆదేశాలు జారీ**

హైదరాబాద్,నవంబర్13**(సమ సమాజం):** రాష్ట్రంలో ఎన్నికల ప్రక్రియను కేంద్ర ఎన్నికల కమిషన్ నిశితంగా పరిశీలిస్తోంది. రాజకీయ పార్టీలకు ఎవరైనా అధికారులు అనుకూలంగా వ్యవహరిస్తున్నారే ఫిర్యాదులు రాగానే సీఈసీ స్పందిస్తోంది. దర్యాప్తు చేసిన తర్వాత ఆరోపణలు నిజమని తేలితే సదరు అధికారులపై చర్యలు తీసుకుంటోంది. ఇప్పటికే పలువురు ఐఏఎస్, ఐపీఎస్?లను బదిలీ చేసిన ఎన్నికల కమిషన్.. పోలీసు అధికారుల బదిలీకి ఆదేశాలు జారీ చేసింది. దీంతో హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో తాజాగా మరికొంత మంది పోలీసు అధికారులు బదిలీ అయ్యారు. అధికార పార్టీ బీఆర్?ఎస్?కు పోలీస్, ఎక్సైజ్ అధికారులు అనుకూలంగా వ్యవహరిస్తున్నారంటూ బీజేపీ నేత, సనత్‌నగర్ నియోజకవర్గ అభ్యర్థి మర్రి శశిధర్ రెడ్డి.. సీఈఓ వికాస్‌రాజ్‌కు కొన్ని రోజుల క్రితం ఫిర్యాదు చేశారు. అంతే కాకుండా కాంగ్రెస్, బీఎస్పీకి చెందిన ఎమ్మెల్యే అభ్యర్థుల నుంచి సైతం ఎన్నికల సంఘానికి పలు ఫిర్యాదులు వెళ్లాయి. వాటిపై నిజానిజాలు తెలుసుకుంటున్న ఎన్నికల సంఘం.. ఆ తర్వాత చర్యలు చేపడుతోంది. ఎన్నికల షెడ్యూల్ వెలువడిన వెంటనే 10 మంది ఐపీఎస్?లతో పాటు పలువురు ఐఏఎస్?లు బదిలీ అయ్యారు. ఆ తర్వాత కరీంనగర్ కలెక్టర్, పోలీస్ కమిషనర్ బదిలీకి సీఈసీ ఆదేశాలు జారీ చేయడంతో ఆ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి చర్యలు తీసుకున్నారు. వచ్చే ఫిర్యాదుల ఆధారంగా కేంద్రం ఎన్నికల సంఘం నిఘా పెడుతోంది. రాజకీయ పార్టీల ప్రచారం ముమ్మరమయ్యేకొద్దీ.. కొంత మంది అధికారులపై ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. బీఆర్?ఎస్? అభ్యర్థులకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారంటూ విపక్ష నాయకులు ఫిర్యాదులు చేస్తున్నారు. రెండు నెలల క్రితం జరిగిన బదిలీల్లో పూర్తిగా అధికార పార్టీకి అనుకూలంగా ఉండే వాళ్లకే పోస్టింగ్‌లు దక్కాయని ఇతర రాజకీయ పార్టీలు ఆరోపిస్తున్నాయి. తగిన ఆధారాలు ఉన్న వాళ్లను ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు బదిలీలు చేస్తున్నారు. హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో 2 రోజుల క్రితం 14 మంది సీఐలను సీపీ సందీప్ శాండిల్య బదిలీ చేశారు. బోరబండ, సైఫాబాద్ పోలీసులతో పాటు టాస్క్‌ఫోర్స్‌లో పనిచేసే పలువురు సీఐలను బదిలీ చేశారు. ఎస్?ఆర్?నగర్ సీఐగా పనిచేసిన సైదులును బదిలీల్లో భాగంగా కీలకమైన ఉత్తర మండల టాస్క్‌ఫోర్స్‌కు పంపించారు. రాజకీయ పలుకుబడితోనే మంచి పోస్టింగ్ దక్కిందనే ఆరోపణలు వచ్చాయి. ప్రస్తుతం ఎన్నికల సంఘానికి ఫిర్యాదులు వెళ్లడంతో సైదులును సైబర్ క్రైమ్స్‌కు బదిలీ చేశారు. అచ్చంపేటలో శనివారం రాత్రి గొడవలు జరిగాయి. ఎమ్మెల్యే గువ్వల బాలరాజుపై దాడి జరిగింది. కాంగ్రెస్ కార్యకర్తలే చేశారంటూ ఆయన ఆరోపించారు. పోలీసుల సహకారంతో గువ్వల బాలరాజు డబ్బులు పంచుతుండగా అడ్డుకోవడానికి వెళ్లిన కాంగ్రెస్ కార్యకర్తలనే సీఐ అనుదీప్ కొట్టడంతో పాటు బెదిరింపులకు దిగారని పీసీసీ నాయకులుకేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. ప్రచారం సందర్భంగా పక్షపాతం చూపిస్తున్నారని పలువురు పార్టీల నేతలు పోలీసులపై ఆరోపణలు చేస్తున్నారు. ఎన్నికల ప్రచారం నుంచి మొదలుకొని పలు విషయాలను పోలీసులు పర్యవేక్షించాల్సి ఉంటుంది. ఈ క్రమంలో ఏ మాత్రం తేడా వచ్చినా పోలీసులపై ఆరోపణలు చేస్తున్నారనే విమర్శలు కూడా ఉన్నాయి.

# వృద్ధులకూ ప్రత్యేక పరిహారం చెల్లించాల్సిందే

**చట్టప్రకారం పరిగణనలోకి ప్రత్యేక కుటుంబంగా వృద్ధులు**

**మల్లన్నసాగర్ భూసేకరణ వ్యవహారంపై హైకోర్టు విచారణ**



హైదరాబాద్,నవంబర్13**(సమ సమాజం):** మల్లన్నసాగర్ భూసేకరణ వ్యవహారంపై దాఖలైన పిటిషన్లపై హైకోర్టు విచారణ చేపట్టింది. భూసేకరణ చట్టంలోని సెక్షన్ 38 ప్రకారం పిటిషనర్లకు పరిహారం చెల్లించకుండా.. రాజ్యాంగ హక్కులకు భంగం కలిగించారని పిటిషనర్ల న్యాయవాది న్యాయస్థానానికి తెలిపారు. జీవో 120 ప్రకారం కుటుంబానికి మొత్తం పరిహారం చెల్లించామని ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది వాదనలు వినిపించారు. ఇరువైపులా వాదనలు విన్న ధర్మాసనం పునరావాసంలో వృద్ధులకూ ప్రత్యేక పరిహారం ఇవ్వాల్సిందేనని స్పష్టం చేస్తూ తీర్పు వెలువరించింది. కుటుంబానికి పరిహారం చెల్లించామంటూ.. తమకు ప్యాకేజీ కల్పించకపోవడాన్ని సవాల్ చేస్తూ.. సిద్దిపేట జిల్లా తొగుట మండలం వేములఘాట్, ఏటిగడ్డ కిష్టాపూర్‌కు చెందిన పలువురు వృద్ధులు హైకోర్టులో వేర్వేరుగా రెండు పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై జస్టిస్ ముమ్మినేని సుధీర్‌కుమార్ విచారణ చేపట్టి ఈ మేరకు తీర్పు వెలువరించారు. మల్లన్నసాగర్ ప్రాజెక్టు నిమిత్తం వేములఘాట్, ఏటిగడ్డ కిష్టాపూర్ గ్రామాలతోపాటు 2,000 ఎకరాలకుపైగా భూములను 2016-19 మధ్య సేకరించారని .. పిటిషనర్ల తరఫు న్యాయవాది న్యాయస్థానానికి తెలిపారు. భూసేకరణ చట్టంలోని సెక్షన్ 38 ప్రకారం పిటిషనర్లకు పరిహారం చెల్లించకుండా.. రాజ్యాంగ హక్కులకు భంగం కలిగించారని పేర్కొన్నారు. కుమారులకు పరిహారం చెల్లించామన్న కారణంగా వృద్ధులైన వితంతువులు, భార్య చనిపోయినవారికి చెల్లించడం లేదని ధర్మాసనానికి వివరించారు. ఇల్లు ఉన్న వృద్ధులకు భూసేకరణలో భాగంగా రిహారం వారిపేరుతోనే చెల్లించారని హైకోర్టుకు.. పిటిషనర్ల తరఫు న్యాయవాది తెలిపారు. పునరావాస ప్యాకేజీ కింద మాత్రం వారిని మినహాయించి కుమారుల పేరుతో ఇచ్చినట్లు చెప్పారు. ప్రభుత్వం జీవో 120 కింద రూ.7.5 లక్షలతోపాటు ఇల్లు మంజూరు చేసిందని ధర్మాసనానికి వివరించారు. కాగా ఎక్కువ మంది 65 ఏళ్లకు పైబడిన వితంతువులు, భార్యను కోల్పోయిన వారు ఉన్నారని.. తమకు ఇల్లు లేక కుమారులు, బంధువుల ఇండ్లలో నివాసం ఉండాల్సి వస్తోందని అన్నారు. కొందరికి మాత్రమే సొంత ఇళ్లుండగా.. ఉన్నాయని, వాటిని భూసేకరణలో భాగంగా తీసుకున్నారని.. యాజమాన్యం, కుటుంబ సభ్యులతో కలిసి ఉన్నారన్న దానితో సంబంధం లేకుండా చట్టప్రకారం పునరావాస బాధితులుగా గుర్తించి పరిహారం చెల్లించాల్సి ఉందని న్యాయస్థానానికి తెలియజేశారు. జీవో 120 ప్రకారం కుటుంబానికి మొత్తం పరిహారం చెల్లించామని ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది ఎ.సంజీవ్‌కుమార్.. హైకోర్టుకు వివరించారు . కుటుంబం అంగీకారంతోనే పునరావాస ప్యాకేజీ కల్పించినట్లు పేర్కొన్నారు. అలా వద్దనుకుంటే 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం చెల్లించడానికి సిద్ధంగా ఉన్నామని న్యాయస్థానానికి తెలిపారు. కుటుంబానికి 250 గజాల్లో డబుల్ బెడ్ రూం ఇంటితోపాటు రూ.7.5 లక్షలు ఇచ్చామని ధర్మాసనానికి చెప్పారు. కేంద్ర చట్టం ప్రకారం పరిహారం 100 గజాల్లో సింగిల్ బెడ్‌రూం ఇళ్లు, రూ.6.50 లక్షలు మాత్రమే ఉంటుందని ఎ.సంజీవ్‌కుమార్.. న్యాయస్థానానికి తెలిపారు. ఒంటరిగా ఉన్న వృద్ధులకు ప్యాకేజీ చెల్లించినట్లు పేర్కొన్నారు. ఇరువైపులా వాదనలను విన్న న్యాయమూర్తి చట్టప్రకారం వృద్ధులకు ప్రత్యేకంగా పునరావాస ప్యాకేజీ కింద పరిహారం అందజేయాలని ఆదేశిస్తూ తీర్పు వెల్లడించారు.

# సీతారామ ప్రాజెక్ట్ మీ ముందే ఉంది



**గోదావరి వరదలు రాకుండా కరకట్టలు నిర్మించాం**

**వాగులపై హైలెవల్ బ్రిడ్జిలు నిర్మించుకున్నాం**

**నియోజకవర్గానికో ఆస్పత్రి నిర్మించుకున్నాం**

**గతంలో పాలకులు తెలంగాణను విస్మరించారు**

**పాత ఖమ్మం జిల్లాను వజ్రం తునకలా తయారు చేస్తున్నాం**

**బిఆర్‌ఎస్‌తోనే తెలంగాణకు శ్రీరామరక్ష**

**ప్రజాశీర్వాదసభల్లో సిఎం కెసిఆర్ పిలుపు**

కొత్తగూడెం,నవంబర్13**(సమ సమాజం):** గోదావరి వరద ముంపున బారినపడకుండా రూ.వెయ్యికోట్లతో కరకట్టలను నిర్మించనున్నట్లు సీఎం కేసీఆర్ ప్రకటించారు. భద్రాచలం, పినపాక,బూర్గంపాడు నియోజకవర్గాల బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభ బూర్గంపాడులో జరిగింది. ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్ పాల్గొని, మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'సీతారామ ప్రాజెక్టు మీ కండ్ల ముందే జరుగుతున్నది. సీతమ్మ సాగర్ 37 టీఎంసీల నీటి కెపాసిటీతో ఉంటది. గోదావరి నుంచి మన ఇష్టమునన్ని నీళ్లు తీసుకోవచ్చు. పాత ఖమ్మం జిల్లాను వజ్రం తునకలా పాత ఖమ్మం తయారవుతుంది. ఏ పార్టీ వైఖరి ఏంటి.. ఎవరి నీతి ఏంది? ఎవరిని నిలబెడితే ప్రజలం నిలబడుతాం అని ఆలోచన చేయాలి. భద్రాచలం నియోజకవర్గంలో అనేక వాగులపై ఇబ్బందులుండేవి. గర్భిణులు ప్రసవమైతే.. మంచంలో పెట్టుకొని మైళ్లకొద్దీ ఎత్తుకొని పోయే పరిస్థితి ఉండేది' అన్నారు. ఇవాళ చాలా వాగులపై హైలెవెల్ బ్రిడ్జీలు కట్టుకున్నాం. కేసీఆర్ కిట్, అమ్మఒడి వాహనం వచ్చి ఇంటి వద్ద నుంచి దర్జాగా తీసుకెళ్లి.. ప్రసవం చేయించి ఇంటి వద్ద వదిలిపెడుతున్నది. అమ్మాయి పుడితే రూ.13వేలు, అబ్బాయి పుడితే రూ.12వేలు ఇస్తున్నం. గతంలో మహామహులు మేధావులు పరిపాలించారు. వారు ఎందుకు ఇవ్వలేదో ఆలోచించాలి. గతంలో చాలా తక్కువ ఏరియాలో వంద పడకల ఆసుపత్రులు ఉండేవి. ఇవాళ బ్రహ్మాండంగా ప్రతి నియోజకవర్గం లో వంద పడకల ఆసుపత్రులు పెట్టుకున్నాం. గతంలో మూడు కిడ్నీ బాధితులకు డయాలసిస్ సెంటర్లు ఉండేవి. ఇవాళ బీఆర్ఎస్ ప్రభుత్వంలో 103 చోట్ల డయాలసిస్ సెంటర్లు పెట్టాం. పెట్టడంతో పాటు కిడ్నీ బాధితులకు పెన్షన్ ఇస్తున్నాం. ఉచిత బస్‌పాస్‌లు సైతం ఇస్తున్నాం. మానవీయ కోణంలో ప్రజల బాధలను దూరం చేయాలని పనులు చేసుకుంటూ ముందుకెళ్తున్నాం అన్నారు. ఎలక్షన్లు రాంగనే.. ఆగమైపోతే.. అలవోకగా వేయొద్దు. మనం ఓటు వేయడానికి కారణం ఉండాలి. నిజా నిజాలు తేల్చాలి. ఈ జిల్లాలో కరకటక ధమనులు మొదలయ్యారు ఇద్దరు. బీఆర్ఎస్ పార్టీని అసెంబ్లీ గడప తొక్కనివ్వమని మాట్లాడుతున్నరు. ఇంత అహంకారమా ? బీఆర్ఎస్ అభ్యర్థులను అసెంబ్లీకి ప్రజలైన మీరే కదా? ఒక వ్యక్తి కాదు కదా? ఇలాంటి దుర్మార్గుల అహంకారాన్ని అణచివేయడానికి, అలాంటి వారి తాటతీయాలి. వారికి బుద్ధి చెప్పాలి. నాలుగైదు సమస్యలు వెంకట్రావ్, రేగా కాంతారావు చెప్పారు. నేను మీకు హామీ ఇస్తున్నానన్నారు. గతంలో వరదలు వచ్చినయ్. భద్రాచాలం నేను వచ్చాను.. పరిశీలన చేశాం. 14వేల కుటుంబాలకు ఇంటికి రూ.10వేల చొప్పున ఇచ్చాం. ఎవరైనా నష్టపోయే వారికి ఇండ్లు కట్టించాం. గోదావరి కరకట్టలు రూ.వెయ్యికోట్లతో కట్టాలని రిపోర్ట్ వచ్చింది. నేను స్వయంగా వచ్చి శంకుస్థాపన చేసి వరద నివారణకు చర్యలు తీసుకుంటాం. బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపిస్తే భద్రాద్రి సీతారాములను దర్శించుకొని.. ఒక పూట భద్రాచలంలో, మరొకచోట ఉంటాను. మీ మధ్యనే ఉండి రాష్ట్ర అధికారుల బృందాన్ని తీసుకొని వచ్చి అన్ని సమస్యలు పరిష్కరిస్తాం. రెండు నియోజకవర్గాల్లోని దళితులకు దళితబంధు ఒకేసారి ఇప్పిస్తా'నన్నారు. ధరణి పోర్టల్‌తో రైతుల భూములను ఎవరూ గోల్‌మాల్ చేయలేరని సీఎం కేసీఆర్ స్పష్టం చేశారు. సీఎం కేసీఆర్ ముఖ్య అతిథిగా హాజరై పార్టీ అభ్యర్థులు రేగా కాంతారావు, తెల్లం వెంకట్రావుకు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'ఎన్నికలకు చాలా సమయం ఉన్నది. గ్రామాలు, పట్టణాలకు బస్తీలకు వెళ్లిన తర్వాత పెద్ద మనుషులతో చర్చ పెట్టాలి. నిజానిజాలు తేల్చాలి. వాస్తవాలను గమనించి ముందుకుపోతే మన బతుకులు బాగుపడుతయ్. లేక పోతే దెబ్బతింటాం. బాధలు పడుతాం' అన్నారు. బీఆర్ఎస్ పుట్టుక మీ కండ్లముందే జరిగింది. బీఆర్ఎస్ పుట్టిందే తెలంగాణ ప్రజల హక్కులు, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం. కాంగ్రెస్ చరిత్ర మీకు తెలుసు. 120-130 సంవత్సరాల కిందట పుట్టింది. బీఆర్ఎస్ పార్టీ చరిత్ర కూడా మీముందుంది. ఈ పార్టీల వైఖరిపై బాగా చర్చచేయాలని కోరుకుంటున్నా. ఈ ఎన్నిక పినపాక వరకు భద్రాచలం వరకో ఉండదు. ఇక్కడ గెలిచే అభ్యర్థులను బట్టి రాష్ట్రం ప్రభుత్వం ఏర్పడుతుంది. ఆ ప్రభుత్వం సరైన నడక నడిస్తే ప్రజాబాహుల్యానికి మేలు జరుగుతుంది. లేకపోతే నష్టం వచ్చే అవకాశం ఉంటుంది. ఇక్కడ గిరిజనులు విశేషంగా ఉండే ప్రాంతం. గిరిజనులతో పాటు దళిత వర్గాల ప్రజలు ఉన్నరు. వాళ్ల బతుకులు బాగా లేవు. వాళ్లకు భూములు కూడా లేవు. అది వాస్తవం' అన్నారు. దేశానికి స్వతంత్రం వచ్చి 75 సంవత్సరాలు అవుతున్నా.. దళితుల బతుకులు అట్లనే ఎందుకున్నయ్ ? దీనికి బాధ్యులు ఎవరూ ? యుగయుగాలు, తరతరాలుగా అణచివేబడ్డ జాతికి స్వతంతం వచ్చిన తెల్లవారి నుంచే మంచి కార్యక్రమాలు పెట్టి ఉంటే దళితుల బతుకులు ఇలా ఉండేవి కావు. అందు కోసమే తెలంగాణ ప్రభుత్వం దళితబంధు కార్యక్రమాన్ని తీసుకువచ్చింది. తెలంగాణ వచ్చిన నాడు పరిస్థితి ఏంటో మీకు తెలుసు. కరెంటు, తాగు, సాగునీటి సమస్యలు. చేనేత కార్మికుల ఆత్మహత్యలు, రైతుల వలసలు, ఆకలి చావులు. అప్పులు కట్టలేక.. బోర్లు వేయలేక.. కరెంటు సరిగా రాక దారుణమైన పరిస్థితి ఉండేది. ఎలా వెళ్లాలో అర్థంకాని పరిస్థితి. కష్టపడి రాష్ట్రం తెచ్చుకున్నాం కాబట్టి బాధ్యతతో పటిష్టంగా ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తూ ముందుకెళ్లాలని కంకణబద్ధులమై పని చేశాం' అని తెలిపారు. పది సంవత్సరాల పరిస్థితి, చరిత్ర మీ కండ్ల ముందున్నది. అన్నింటికన్నా ముందు మేం ఇచ్చిన ప్రాధాన్యం. రోడ్లు, సాగునీరు, తాగునీరు, కరెంటు ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చాం. మీరందరూ చూస్తున్నారు. మీ ముందే మణుగూరులో భద్రాద్రి పవర్ ఎ÷-లాంట్ వచ్చింది. ఒకప్పుడు వాస్తవానికి వీటీపీఎస్ విజయవాడ థర్మల్ పవర్ స్టేషన్ మణుగూరులో రావాల్సింది. కానీ, సమైక్యవాదులు కుట్ర చేసి మణుగూరుకు రాకుండా విజయవాడకు తరలించారు. అందువల్ల మనం చాలా నష్టపోయాం. కనీసం చిన్నదైనా సరే ఇక్కడైనా రావాలని చెప్పి మణుగూరులో పవర్ ఎ÷-లాంట్ పెట్టుకున్నాం. ఎంతో కొంత మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దాని ద్వారా లభిస్తున్నయ్. అన్నింటిని మించింది ప్రధాన రంగం వ్యవసాయరంగం. రైతులు అప్పుల్లో ఉన్నారు. అప్పులు కట్టలేక చాలా మంది ఆత్మహత్యలు చేసుకుంటున్నరు. ఆ బాధలు పోవాలని.. రైతులు చక్కగా బతకాలని.. వ్యవసాయ స్థిరీకరణ జరగాలని ఎన్నో ప్రయత్నాలు చేశాం. అందులో విజయం సాధించాం' అన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఎక్కడ చూసినా ప్రభుత్వం సపోర్ట్ లేకుండా వ్యవసాయం నిలబడలేదు. అన్ని దేశాల్లో సబ్సిడీలు ఇచ్చి వ్యవసాయానికి సపోర్ట్ చేస్తున్నాయ్. మన దేశంలో ఉన్న దుర్మార్గమైన పాలసీల వల్ల రైతులకు ఎలాంటి సపోర్ట్ లేదు. అందుకే మన దగ్గర రెండు మూడు కార్యక్రమాలు తీసుకున్నాం. రైతులకు ప్రాజెక్టుల ద్వారా నీటి సరఫరా చేస్తే నీటి తీరువా లేదు. గతంలో ఉన్న బకాయిలను రద్దు చేశాం. మోటర్లు కాలిపోకుండా నాణ్యమైన 24గంటలు ఉచితంగా ఇస్తున్నాం. పెట్టుబడి సాయం ఇస్తున్నాం. రైతులకు ఏదైనా ఇబ్బంది జరిగి చనిపోతే ఆ వారి ఇంటికి రూ.5లక్షలు వారం రోజుల్లో వస్తున్నయ్. రైతుబీమా బ్రహ్మాండంగా పని చేస్తున్నది. రైతుల గ్రామాల్లోనే ధాన్యం కొనుగోలు చేస్తున్నాం. వీటన్నింటిని తీసుకువచ్చి ధరణి పోర్టల్ తీసుకువచ్చాం. ప్రభుత్వం తన వద్ద ఉన్న అధికారాన్ని మీకే ఇచ్చింది. మీ భూమి యాజమాన్యం మారాలంటే.. గతంలో ప్రభుత్వ అధికారులు మార్చేది. ఈ రోజు ఆ పరిస్థితి లేదు. మీ బొటన వేలు పెడితే తప్ప.. మీ భూమిని ఎవరూ గోల్‌మాల్ చేయలేరు. ఇప్పుడిప్పుడే రైతులు తేరుకుంటున్నర్. అప్పుల నుంచి తేరుకుంటున్నరు' అన్నారు.

# నాంపల్లిలోని బజార్ ఘాట్‌లో అగ్నిప్రమాదం



(మొదటి పేజీ తరువాయి) ప్రత్యేక దృష్టి సారించాలని కోరుతున్నారు. ఈ ఘటనపై దర్యాప్తు వేగవంతం అయింది. భవన యజమాని కోసం పోలీసులు గాలిస్తున్నారు. భవన యజమాని రమేష్ జైష్వాల్‌కు ప్లాస్టిక్ తయారు చేసే ఇండస్ట్రీ ఉంది. దానికి సంబంధించిన కెమికల్ డ్రమ్స్‌ను ఈ అపార్ట్‌మెంట్ గ్రౌండ్‌ఫ్లోర్లో నిల్వచేశారు. 150 డబ్బాలకుపైనే ఇక్కడ ఉంచారు. ఇవాళ జరిగిన అగ్నిప్రమాదంలో ఒక్కసారిగా డబ్బాలు ఒక్కసారిగా పేలిపోయాయి. మంటలు, దట్టమైన పొగ క్షణాల్లోనే అపార్ట్‌మెంట్ మొత్తాన్ని చుట్టుముట్టేశాయి. ఆ సమయంలో 5 అంతస్తుల అపార్ట్‌మెంట్‌లో మొత్తం 21 మంది ఉన్నారు. వీరిలో నాలుగు నెలల చిన్నారి సహా 9 మంది ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో ఇద్దరు బంధువుల ఇంటికి వచ్చి ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. ఈ ప్రమాదంలో చనిపోయిన వారంతా అక్కడ అద్దెకు ఉంటున్నవారేనని పోలీసులు తెలిపారు. ఈ అగ్ని ప్రమాదం ఉదయం 9.30 గంటల సమయంలో జరిగింది. గ్రౌండ్‌ఫ్లోర్‌లో గ్యారేజ్ ఉండటంతో కారు రిపేర్ చేస్తుండగా మంటలు వచ్చాయని కొందరు చెబుతున్నారు. అదే సమయంలో అక్కడ నిల్వ ఉంచిన డీజిల్, కెమికల్ డ్రమ్ములకు మంటలు అంటుకోవడంతో ప్రమాద తీవ్రత మరింత పెరిగిందంటున్నారు. సమాచారం అందుకున్న వెంటనే ఘటనాస్థలికి నాలుగు ఫైరింజన్లతో అగ్నిమాపక సిబ్బంది చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చాయి. మొత్తంగా బెంజైల్ నైట్రేట్ రసాయనం వల్ల ఈ ప్రమాదం జరిగిందంటున్నారు. బాణాసంచా వల్ల ప్రమాదం జరిగి ఉండొచ్చని మొదట ప్రాథమికంగా అంచనాకు వచ్చినా.. అది కాదని.. మరేదైనా కారణ ఉంటుందనే దానిపైనా పూర్తి స్థాయిలో విచారణ జరుగుతోందని పోలీసులు చెబుతున్నారు. మృతదేహాలను ఉస్మానియా మార్చురీకి తరలించారు. గాయపడ్డ వారికి కూడా చికిత్స కొనసాగుతోంది. ఆత్మీయుల్ని కోల్పోయిన బంధువుల రోదనలతో ఉస్మానియా దగ్గర పరిస్థితి హృదయ విదారకంగా ఉంది. బజార్‌ఘాట్ అగ్నిప్రమాదంపై పోలీసులు వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. 304, 285, 286, ఐపీసీ 9 బీ(1) సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ ప్రమాదంపై అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగుతోంది. స్థానికులు, బాధితుల వివరాలను తీసుకుని.. హైదరాబాద్ పోలీసులు విచారణ ప్రారంభించారు. పరారీలో ఉన్న బిల్డింగ్ యజమాని రమేష్ జైష్వాల్ కోసం ప్రత్యేక పోలీసు బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి. కాగా.. గ్రేటర్ పరిధిలో జరిగిన ప్రమాదాలు ఇప్పటికీ కళ్లముందే కదలాడుతున్నాయి. ఈ సమయంలో నాంపల్లి దుర్ఘటన అందరినీ ఉలిక్కిపడేలా చేసింది. స్వప్నలోక్ ఘటన సమయంలో జీహెచ్ఎంసీ అధికారులు నానా హడావుడి చేశారని.. అప్పుడు మున్సిపల్ శాఖ ఆధ్వరయంలో కమిటీ వేసినా ఫలితం లేకుండా పోయిందని పేర్కొంటున్నారు. కమిటీ ఏర్పాటు తర్వాత 200 మందికి నోటీసులు ఇచ్చినా.. చర్యలు శూన్యమని ఆరోపిస్తున్నారు. తాజాగా ప్రమాదం జరిగిన భవనానికి %+%ం2కు మాత్రమే పర్మిషన్ ఉందని.. కానీ.. పరిమితికి మించి అంతస్తులు నిర్మించారు. ఈ భవనం మొత్తం.. నాలుగు ఫ్లోర్లు, పెంట్ హౌస్ నిర్మించారు.. మొత్తంగా ఈ ప్రమాదం.. నిర్లక్ష్యంగానే జరిగిందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అసలు జనావాసాల మధ్య కెమికల్ డ్రమ్ములు ఎలా నిల్వ చేశారు..? ప్రమాదకర రసాయనాలు నిల్వ చేసినా ఎవరూ పట్టించుకోలేదా..? అనుమతులు ఉన్నాయో లేవో అడిగేవారే లేరా..? అసలు అపార్ట్‌మెంట్ సెల్లార్లు ఉన్నది పార్కింగ్ కోసమా.. గోడౌన్ల కోసమా..? వరుస ప్రమాదాలతోనైనా అధికారులు కళ్లు తెరుస్తారా..?.. %+ఎవీజ% రెగ్యులర్ తినిఖీలు లేకపోవడం వల్లే ఇలాంటివి జరుగుతున్నాయనే ఆరోపణలకు ఏం సమాధానం ఇస్తారో అనేది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. నాంపల్లి ఘటనపై సీఎం కేసీఆర్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అగ్నిప్రమాదంలో మరణించిన మృతుల కుటుంబాలకు తీవ్ర సంతాపాన్ని ప్రకటించారు. తక్షణమే పటిష్టమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. తీవ్రంగా గాయపడ్డవారికి మెరుగైన వైద్యం అందించాలన్నారు. ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. నాంపల్లి అగ్నిప్రమాద ఘటనను పరిశీలించడానికి మంత్రులు కేటీఆర్, తలసాని శ్రీనివాస్ యాదవ్ అక్కడికి చేరుకుని, పరిస్థితిని పరిశీలించారు. మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించారు. మరోవైపు టీబీజేపీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. మరణించిన వారి కుటుంబాలకు ప్రధానమంత్రి సహాయనిధి నుంచి ఆర్థిక సాయం అందేలా కృషి చేస్తానన్నారు. వీలైతే సోమవారం సాయంత్రంలోగా ప్రకటన చేసేందుకు ప్రయత్నిస్తామన్నారు. కాగా ఈ ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ఏడుగురు మృతి చెందిన సంగతి తెలిసిందే. ఇదిలాఉంటే.. బాధిత కుటుంబాలను రాజకీయ పార్టీల నాయకులు పరామర్శిస్తూ అండగా ఉంటామని హామీ ఇస్తున్నారు. ప్రమాద స్థలిని మంత్రులు కేటీఆర్, తలసాని శ్రీనివాస్ యాదవ్ అధికారులతో కలిసి సందర్శించారు. ప్రమాదానికి అసలు కారణాలేంటి అనే దానిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం తరుపున రూ.5 లక్షలు చొప్పున పరిహారం అందిస్తామని మంత్రి కేటీఆర్ హామీ ఇచ్చారు. ప్రమాదంలో అస్వస్థతకు గురైన వారికి ఉస్మానియా ఆస్పత్రిలో మెరుగైన వైద్యం అందిస్తామని, అవసరమైతే ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తామని తెలిపారు. ప్రమాదంపై దర్యాప్తు చేపడతామని వెల్లడించారు. ప్రమాదానికి రాష్ట్ర ప్రభుత్వమే కారణమని, దీనికి ప్రభుత్వం బాధ్యత వహించాలంటూ ప్రతిపక్ష పార్టీలు డిమాండ్ చేస్తున్నాయి. ఘటనా స్థలాన్ని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, సీపీఐ నేత నారాయణ పరిశీలించారు.

# రేవంత్‌రెడ్డి ప్రజలను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నారు



(మొదటి పేజీ తరువాయి) లీగల్ టీం తెలిపింది. దుబ్బాక ఎమ్మెల్యే అభ్యర్థి ప్రభాకర్ రెడ్డి ఇప్పటికీ సీరియస్ గానే ఉన్నారు.. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్యే అభ్యర్థులపై దాడులు జరిగితే రేవంత్ రెడ్డి కనీసం మానవత్వం లేకుండా మాట్లాడుతున్నారు.. పదేళ్లుగా బీఆర్ఎస్ పాలనలో ఎక్కడైనా ఘటనలు జరిగాయా? అని ప్రశ్నించారు. ఇప్పుడు జరుగుతున్న ఘటనలు ఎవరి వల్ల జరుగుతున్నాయో ప్రజలు ఆలోచన చేయాలి.. రేవంత్ కు టీడీపీ తల్లిపార్టీ అయితే.. కాంగ్రెస్ అత్తపార్టీ అంటూ విమర్శించారు. కాంగ్రెస్ పార్టీకి టీడీపీకి అంతర్గత ఒప్పందం కుదిరింది.. స్టార్ క్యాంపెనియర్ గా ఉన్న రేవంత్ రెడ్డి భాష పద్ధతిగా ఉండాలి.. ఎంసీసీ కమిటీకి చూపించిన ప్రకటనలు ఒకటి.. బయట ప్రచారం మరొకటి చేస్తున్నారు.. ఎదైనా కన్ఫ్యూజన్ ఉన్న అంశాలపై ఈసీ క్లారిటీ ఇస్తే బాగుంటుందని బీఆర్ఎస్ లీగల్ టీమ్ తెలిపింది.

# 17న తెలంగాణలో అమిత్ షా పర్యటన



(మొదటి పేజీ తరువాయి) నేతలు తెలంగాణలో పర్యటించారు. అయితే, ఎన్నికలకు సమయం దగ్గర పడుతుండటంతో కీలక నేతలతో ప్రచారాన్ని ముమ్మరంగా నిర్వహించాలని బీజేపీ యోచిస్తోంది. దీనిలో భాగంగా ఈ నెల చివరి వారంలో ప్రధాని మోడీ వరస పర్యటనలు ఉన్నాయి. 25, 26,27 తేదీలలో మోడీ తెలంగాణలో పర్యటించనున్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా టూర్ కి సంబంధించి కూడా ఇప్పటికే షెడ్యూల్ ఖరారు అయినట్టుగా తెలుస్తుంది. ఈనెల 17న అమిత్ షా తెలంగాణలో పర్యటించనున్నారు. ఒకే రోజు నాలుగు సభలకు బిజెపి ప్లాన్ చేస్తున్నట్టుగా తెలుస్తోంది. నల్గొండ, వరంగల్, గద్వాల్, రాజేంద్రనగర్ లో పబ్లిక్ మీటింగ్స్ ఉండనున్నాయి. ఇప్పటికే పలు రాష్ట్రాలకు సంబంధించిన బీజేపీ నేతలు 119నియోజకవర్గాల్లో పాగా వేసి ఎన్నికలు పూర్తి అయ్యేవరకు గ్రౌండ్ లెవెల్‌లో పనిచేస్తున్నారు. అయితే, బీజేపీ మేనిఫెస్టోకి సంబంధించి కూడా కూడా క్లారిటీ వచ్చింది. అమిత్ షా పర్యటన 17న ఉన్న నేపథ్యంలో ఆ రోజే మేనిఫెస్టోని రిలీజ్ చేయాలని బీజేపీ భావిస్తోంది. ఇక మేనిఫెస్టో విషయానికి వస్తే సెంటిమెంటును రగిలించే విధంగా కొన్ని ప్రాంతాల పేర్ల మార్పుతో పాటు పలు కీలకమైన అంశాలను పొందుపరిచే అవకాశం కనిపిస్తుంది. వైద్య, విద్య ఉచితంగా అమలు చేస్తామని మేనిఫెస్టోలో పెట్టే అవకాశం ఉంది. ఇక జాబ్ క్యాలెండర్ ఉపాధి అవకాశాలపైన కూడా ప్రకటన చేయాలని బీజేపీ భావిస్తోంది. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు భిన్నంగా మేనిఫెస్టోను రూపొందించి.. ప్రజలను ఆకట్టుకునేందుకు బీజేపీ ప్రణాళికతో ముందుకెళ్తోంది.

# కరెంట్, రైతుబంధుపై కేసీఆర్ మతిలేని మాటలు



(మొదటి పేజీ తరువాయి) మద్దూర్, గుండుమల్‌లో రోడ్‌షో నిర్వహించిన రేవంత్‌రెడ్డి.. బీఆర్ఎస్‌పై విమర్శలు గుప్పించారు. కేసీఆర్ పాలనలో కొడంగల్‌కు కృష్ణా జలాలు, రైల్వే లైన్.. వచ్చాయా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ వస్తే రైతుబంధు బంద్ చేస్తామని.. కేసీఆర్ మతిలేని మాటలు మాట్లాడుతున్నారని విమర్శించారు. రైతుల కష్టాలు తెలుసని.. రైతుబంధు తామెందుకు బంద్ చేస్తామని ప్రశ్నించారు. నియోజకవర్గంలో ఎటువంటి అభివృద్ధి చేయకుండా.. మన ప్రాంతాన్ని పాడు చేశారని ధ్వజమెత్తారు. దౌల్తాబాద్‌లో తాను వేసిన రోడ్లే కనిపిస్తున్నాయన్నారు. నరేందర్‌రెడ్డి ఎమ్మెల్యే అయ్యాక ఇసుక దందా, ట్రాక్టర్లపై కమిషన్లు తీసుకుంటున్నాడని విమర్శించారు. కాంగ్రెస్ హయాంలో నారాయణపేట- కొడంగల్ ప్రాజెక్టుకు అనుమతులు తీసుకోస్తే.. నిర్మించకుండా వదిలేశారని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో ఈ ప్రాంతానికి కృష్ణా జలాలు, రైల్వే లైన్, డిగ్రీ కాలేజ్ ఏవి తీసుకురాలేదని దుయ్యబట్టారు. మద్దూరులో తాగునీటి సమస్య వల్ల ఈ ఊరికి పిల్లనిచ్చే వాళు కాదని.. తన హయాంలోనే కోయిల్ సాగర్ నుంచి నీటి వసతి కల్పించినట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే మద్దూరులో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, 100 పడకల హాస్పిటల్, స్టేడియం నిర్మిస్తామన్నారు. నారాయణపేట- కొడంగల్ ఎత్తిపోతలను రెండేళ్లలో పూర్తి చేసి.. ఈ ప్రాంతానికి నీళ్లు తెచ్చే బాధ్యత కాంగ్రెస్‌దని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం తీసుకురావాలని.. రేవంత్‌రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామన్నారు. చేయూత పేరుతో వృద్దులకు, వికలాంగులకు, చేనేత కార్మికులకు, బీడీ కార్మికులకు, ఒంటరి మహిళలకు.. అర్హులైన వారికి నెలకు రూ.4000 పెన్షన్ ఇస్తామని హామీ ఇచ్చారు. రైతు భరోసా కింద.. రైతులకు, కౌలు రైతులకు ప్రతి ఏటా ఎకరాకు రూ.15,000 పెట్టుబడి సాయం, వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగించే కూలీలకు ప్రతి ఏటా రూ.12,000, వరి పంట పండించే రైతులకు.. మద్దతు ధరకు అదనంగా మరో రూ.500 బోనస్ కింద కలిపి చెల్లిస్తామన్నారు. సీఎం కేసీఆర్.. డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇస్తానని చెప్పి మోసం చేశారని దుయ్యబట్టారు. తాను మాత్రం పంజాగుట్టలో రూ. 2000కోట్లతో ఇంద్రభవనం నిర్మించుకున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే నియోజకవర్గంలో ఇల్లులేని వారికి ఇంటి స్థలంతో పాటు రూ.5 లక్షలు ఆర్థిక సాయం చేస్తామన్నారు. మహాలక్ష్మి పేరుతో మహిళలకు ప్రతి నెలా రూ.2500, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, రూ.500లకే గ్యాస్ సిలిండర్.. ఇవ్వనున్నట్లు తెలపారు. ఆడపిల్లల పెళ్లికి రూ. లక్షతో పాటు.. తులం బంగారం ఇస్తామన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాలకు గృహలక్ష్మి కింద నెలకు 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్ ఇస్తామన్నారు. కాంగ్రెస్ వస్తే రైతుబంధు బంద్ చేస్తామని.. కేసీఆర్ మతిలేని మాటలు మాట్లాడుతున్నారు. రైతుబంధును మేమేందుకు బంద్? చేస్తాం. రాష్ట్రంలో రైతుభరోసా కింద రైతులకు, కౌలు రైతులకు ఎకరాకు రూ. 15,000 పెట్టుబడి సాయం అందిస్తామని అన్నారు.

# ఢిల్లీలో మళ్లీ పెరిగిన వాయు కాలుష్యం



(మొదటి పేజీ తరువాయి) ప్రారంభించింది. సుప్రీంకోర్టుకు అందజేసిన అఫిడవిట్‌లో ఈ అంశాన్ని ప్రస్తావించి ప్రభుత్వం, కృత్రిమ వర్షంతో కాలుష్యాన్ని కట్టడి చేయాలని చూస్తోంది. ఢిల్లీ సహా ఉత్తరాదిన అనేక నగరాలను శీతాకాలంలో తీవ్రమైన వాయుకాలుష్యం వేధిస్తోంది. ప్రకృతిపరంగా ఎదురయ్యే పరిస్థితులకు మానవ తప్పిదాలు తోడై నానాటికీ వాయుకాలుష్యం స్థాయిలు పెరుగుతున్నాయే తప్ప తగ్గడం లేదు. పంజాబ్, హర్యానా సహా ఇరుగు పొరుగు రాష్ట్రాల్లో ఖరీఫ్ పంట ముగిసిన తర్వాత పంటవ్యర్థాలను తగులబెట్టడం వల్ల పరిస్థితి మరింత జఠిలంగా మారుతోంది. పంటవ్యర్థాలను కాల్చకుండా ప్రత్యామ్నాయ పద్ధతులను ఆశ్రయించాలంటూ అటు సుప్రీంకోర్టు, ఇటు కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో అవి ఆచరణకు నోచుకోవడం లేదు. పంటవ్యర్థాలను కాల్చడం హత్యతో సమానం అంటూ సర్వోన్నత న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసినా సరే.. పరిస్థితిలో ఇప్పటికిప్పుడు మార్పు వచ్చే అవకాశం లేదు. ఇదిలా ఉంటే.. దీపావళి పర్వదినం సందర్భంగా వినియోగించే బాణాసంచా ఢిల్లీ గాలిని మరింత విషతుల్యంగా మార్చుతోంది. ఈమధ్య కాలంలో చైనా నుంచి అక్రమమార్గాల్లో దిగుమతి చేసుకుంటున్న టపాసుల్లో అత్యంత ప్రాణాంతక రసాయన మిశ్రమాలున్నాయని అనేక అధ్యయన నివేదికలు తేల్చాయి. ఈ సందర్భంగా తొలుత చైనా టపాసులపై, ఆ తర్వాత కాలుష్యాన్ని వెదజల్లే టపాసులపై న్యాయస్థానం నిషేధం విధిస్తూ వచ్చింది. గ్రీన్ క్రాకర్స్ పేరుతో కాలుష్యాన్ని వెదజల్లని టపాసులకు మినహాయింపునిచ్చింది. ఈ ముసుగులో వ్యాపారుల నుంచి వినియోగదారులు కాలుష్యకారక టపాసులను వినియోగించి కాలుష్యం పెరగడానికి కారణమవుతున్నారు. ఢిల్లీలో సూర్యోదయాన్ని సైతం అడ్డుకునేస్థాయిలో వాయుకాలుష్యం, పొగమంచు కలిసిపోయాయి. శీతాకాలంలో పొగమంచు ఏర్పడడం సహజమే. కానీ వాయుకాలుష్యం అందులో కలిసిపోయి 'విజిబిలిటీ'ని సైతం ప్రభావం చేస్తుంది. సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ (CPCB) ఏర్పాటు చేసిన మీటర్ల ప్రకారం ఢిల్లీలోని పలు ప్రాంతాల్లో ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ (AQI) మళ్లీ పూర్ క్వాలిటీకి చేరుకుంది. గత ఏడాదితో పోల్చితే ఈసారి బాణాసంచా వినియోగం చాలా వరకు తగ్గినప్పటికీ.. ప్రజలు చాలా చోట్ల టపాసులు కాల్చారు. నగరంలో టపాసుల మోత అర్ధరాత్రి వరకు వినిపించింది. దీంతో ఢిల్లీతో పాటు నేషనల్ క్యాపిటల్ రీజియల్ పరిధిలో ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ (AQI) దాదాపు 300కు చేరుకుంది. ఆనంద్ విహార్ వద్ద 296, ఆర్కేపురం వద్ద 290, ఐటీవో వద్ద 263 పాయింట్లు నమోదైంది. అక్టోబర్ నెల నుంచే ఢిల్లీలో కాలుష్యం స్థాయిలు పెరుగుతూ వచ్చాయి. పర్టిక్యులేట్ మ్యాటర్ (P.M 2.5) స్థాయిలు ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్దేశించిన ప్రమాణాల కంటే 20 రెట్లు అధికంగా ఉన్నాయి. ఈ కారణంగానే ఢిల్లీ పాఠశాలలకు ప్రభుత్వం సెలవులు ప్రకటించింది. కాలుష్యకారక వాహనాలు, భవన నిర్మాణ పనులపై నిషేధం విధించింది. స్మాగ్ గన్లు (నీటిని తుంపరగా మార్చి వెదజల్లే యంత్రాలు) వినియోగిస్తూ వాయుకాలుష్యాన్ని తగ్గించే ప్రయత్నాలు చేస్తోంది. వీటితో పాటు 'ఆడ్-ఈవెన్' విధానాన్ని అమలు చేయాలని భావించినప్పటికీ.. ఈ విధానం ద్వారా కాలుష్యం తగ్గినట్టు ఎలాంటి ఆధారాలు లేకపోవడం వల్ల న్యాయస్థానం తప్పుబట్టింది. అయితే వర్షం కాలుష్యాన్ని తగ్గిస్తుంది కాబట్టి కృత్రిమంగా వర్షం కురిపించి వాయుకాలుష్యం స్థాయిలను తగ్గించాలని ఢిల్లీ ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకోసం సుప్రీంకోర్టును అనుమతితో పాటు.. కేంద్ర ప్రభుత్వ సహాయాన్ని కోరింది.

# ఎస్సీ వర్గీకరణ ఆలస్యంలో మొదటి ముద్దాయి కాంగ్రెస్



(మొదటి పేజీ తరువాయి) పేర్కొన్నారు. దీనిపై స్పష్టత కోసం ఏడుగురు న్యాయమూర్తులతో అక్టోబర్ 10న మరో ధర్మాసనాన్ని ఏర్పాటు చేశారని కిషన్ రెడ్డి తెలిపారు. అనేక రాజకీయ పార్టీల మద్దతు ఉన్నా అనేక సంవత్సరాలు పాలించిన కాంగ్రెస్ ఎస్సీ వర్గీకరణకు అనుకూలమని చెప్పింది. తెలుగు రాష్ట్రాలను పాలించిన టీడీపీ దీన్ని నాలుగు సంవత్సరాలు అమలు చేసింది. దీనిపై కంటితుడుపు చర్యనే తప్ప ఎవరూ కూడా చిత్తశుద్ధితో సమస్య పరిష్కారం కోసం ప్రయత్నాలు చేయలేదని అన్నారు. బీజేపీలో ఎస్సీ, ఎస్టీ ఎమ్మెల్యేలు, మంత్రులు అధికంగా ఉన్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో ఎక్కువ ఎవరు ఉన్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పభుత్వం చరిత్ర ఏంటని ప్రశ్నించారు. స్వాతంత్ర్యం ఏర్పాటు తర్వాత మొట్టమొదటి సారి ఒక గిరిజన మహిళను రాష్ట్రపతి చేసిన ఘనత బీజేపీ ప్రభుత్వానిదని తెలిపారు. కాంగ్రెస్ నుంచి పాఠాలు నేర్చుకోవాల్సిన అవసరం లేదన్నారు. అటల్ బిహారి వాజ్‌పేయీ ప్రధానిగా ఉన్నప్పుడు మొదటిసారిగా ప్రధానిని చేసే అవకాశం వచ్చినప్పుడు ముస్లిం సామాజిక వర్గానికి చెందిన అబ్దుల్‌కలాంను రాష్ట్రపతిని చేశామని చెప్పారు. బీజేపీ ఏది చెప్తే అదే చేస్తుందని.. కాంగ్రెస్ లాగా ఒకటి చెప్పి.. మరొకటి చేసే పార్టీ కాదని ఎద్దేవా చేశారు. చారిత్రాత్మక కట్టడాలు, సాహసోపేత నిర్ణయాలు తీసుకోవడంలో ప్రధాని నరేంద్ర మోదీ తనకు తానే సాటి అని తెలిపారు. ఎస్సీ వర్గీకరణపై శాశ్వత పరిష్కారం కోసం బేజేపీ ప్రయత్నిస్తుందని కిషన్‌రెడ్డి అన్నారు. బీజేపీ పార్టీ ఏదైతే చెప్తుందో అదే చేస్తుందని.. దళిత ముఖ్యమంత్రిని చేస్తామని చెప్పి మాట తప్పిన కేసీఆర్ ప్రభుత్వం లాంటిది కాదని తెలిపారు.

Edited, Printed, Published & owned by *GOSUKONDA PRUDHVIRAJU*, Published From, Flot n.o. 6 W.P, Sriramanuja nagar colony, Munganoor, Abdullapurmet, Rangareddy- 501511, TELANGANA,
Printed at *Panidhar PUBLICATIONS.* Flot n.o. 6 W.P, Sriramanuja nagar colony, Munganoor, Abdullapurmet, Rangareddy- 501511, *Editor: GOSUKONDA PRUDHVIRAJU*,
RNI.TELTEL/2016/ 73311, Cell:8464816456 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in